క్లుప్తంగా

గ్రామానికి భూమి విరాళం


భూమి ఇచ్చిన లక్‌పతిని అభినందిస్తున్న గ్రామస్తులు

చంద్రుగొండ: మండలంలోని తుంగారం పంచాయతీ టేకులబంజర్ గ్రామానికి చెందిన బాణోత్ లక్‌పతి రూ.40 వేలు విలువ చేసే గుంట భూమిని పంచాయతీకి దానంగా ఇచ్చారు. హోలీ పండుగను పురస్కరించుకుని పంచాయతీ అవసరాల కోసం గుంట భూమిని దానంగా ఇస్తున్నట్లు ప్రకటించారు. లక్‌పతిని గ్రామస్తులు అభినందించారు. కార్యక్రమంలో గ్రామస్తులు గుగులోతు ఈర్యా, ఇస్లావత్ రాజు, అమర్‌సింగ్, పాతల్‌సింగ్, నరేష్ పాల్గొన్నారు.

వేతనాలు పెంచాలి..

దమ్మపేట: ఎన్నికల హామీ మేరకు మధ్యాహ్న భోజన కార్మికుల వేతనాలను పెంచాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యాక్షుడు పిట్టల అర్జున్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం మండలంలోని మండలపల్లి సీఐటీయూ కార్యాలయంలో, మధ్యాహ్న భోజన కార్మికుల మండల స్థాయి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో పిట్టల అర్జున్ మాట్లాడుతూ.. మధ్యాహ్న భోజన కార్మికుల వేతనాలను పదివేల రూపాయలకు పెంచి, పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పెరిగిన నిత్యావసరాల ధరలకు అనుగుణంగా మెనూ చార్జీలను పెంచే విధంగా బడ్జెట్‌లో నిధులు కేటాయించాలన్నారు. కార్యక్రమంలో కొప్పుల శ్రీను, చాపా కుమారి, జయమ్మ, నాగమణి, శ్రీదేవి, శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికలకు సిద్ధంగా ఉండాలి

అశ్వారావుపేటరూరల్: స్థానిక సంస్థల ఎన్నికలకు ఇప్పటి నుంచే పార్టీ నాయకులు, కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని అశ్వారావుపేట మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. శుక్రవారం మండలంలోని మామిళ్ల వారిగూడెం గ్రామంలో జరిగిన ఓ శుభ కార్యానికి హాజరై, అనంతరం పార్టీ గ్రామ బాధ్యులు వనపర్తి మోహన్‌రావు నివాసం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీ కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటామని, కాంగ్రెస్ ప్రభుత్వంపై ఉన్న వ్యతిరేకతను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో అడ్డగోలు హామీలు ఇచ్చి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని, వాటిని అమలు చేయలేకపోతుందని విమర్శించారు. ఈ సమావేశంలో మాజీ ఎంపీపీ జల్లిపల్లి శ్రీరామ్మూర్తి, నాయకులు మందపాటి మోహన్‌రావు, జుజ్జురపు వెంకన్న, తాండ్ర యుగంధర్, చిన్న సత్యనారాయణ, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వర్గీకరణ తర్వాతే ఉద్యోగాలు ఇవ్వాలి

అశ్వాపురం: ఎస్సీ వర్గీకరణ చట్టం వచ్చేంత వరకు ఉద్యోగ నియామకాలు చేపట్టవద్దని, గ్రూప్‌-1, గ్రూప్‌-2, గ్రూప్‌-3 పరీక్ష ఫలితాలు ప్రకటనను నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ ఎంఆర్‌పీఎస్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఇనపల్లి కృష్ణ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో బస్టాండ్ సెంటర్‌లో చేపట్టిన నిరవధిక నిరాహార దీక్షలు శుక్రవారం రెండో రోజుకు చేరుకున్నాయి. దీక్షలకు తుడుందెబ్బ రాష్ట్ర ప్రచార కార్యదర్శి తంగెళ్ల భద్రయ్య, బీఆర్‌ఎస్ పార్టీ మండల యువజన అధ్యక్షుడు గద్దల రామకృష్ణ, విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు బ్రహ్మచారి మద్దతు తెలిపారు. దీక్షల్లో ఎంఆర్‌పీఎస్ నాయకులు మిరియాల వెంకటేశ్వర్లు, మడిపల్లి రమేష్, మందా రాంబాబు, గద్దల వెంకటేశ్వర్లు, కొమ్ము రాంబాబు, శెట్టిపల్లి భాస్కర్, మురికిపూడి వెంకటేశ్వర్లు, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

దుమ్ముగూడెం: మండలంలోని లక్ష్మీనగరం గ్రామంలో గల శ్రీదాసాంజనేయ ఆలయ అర్చకుడు ఆరుట్ల రాజగోపాల్‌చార్యులు రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా.. బాధిత కుటుంబానికి జిల్లా, రాష్ట్ర అర్చకులు రూ.82వేల ఆర్థికసాయం అందజేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర,జిల్లా అర్చక బాధ్యులు మాట్లాడుతూ...అర్చకులకు ఎటువంటి సమస్య ఎదురైనా అందరకీ అండగా నిలబడతామని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా మాజీ అధ్యక్షులు అంజనీ కుమార్ శర్మ, నూతన అధ్యక్షులు పురాణం కిరణ్ కుమార్ శర్మ, గౌరవాధ్యక్షులు పెనుమర్తి సత్యనారాయణమూర్తి, సంతోష్ కుమార్ ప్రసాద శాస్త్రి, చందు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పూజలు

కరకగూడెం: మండల పరిధిలోని బర్దారం అటవీ ప్రాంతంలోని శ్రీ లక్ష్మీ నరసింహా స్వామి దేవస్థానాన్ని స్థానిక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు శుక్రవాం సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం చొప్పాల గ్రామంలో వైభవంగా జరుగుతున్న ముసలమ్మ తల్లి జాతరకు వెళ్లి గుడిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు య్యద్ ఇక్బాల్ హుస్సేన్, మాజీ సర్పంచ్‌లు పోలెబోయిన తిరుపతయ్య, శ్రీవాణి, నాయకులు ఎర్ర సురేష్ తదితరులు పాల్గొన్నారు.

హోలీ.. రంగుల కేళి


భద్రాచలంటౌన్: వేడుకల్లో పీఓ సతీమణి మనీషా, డీడీ మణెమ్మ, ఐటీడీఏ ఉద్యోగులు


గుండాల: వీధుల్లో రంగులు పూసుకుంటున్న చిన్నారులు

హోలీ పండుగ సంబురాలను శుక్రవారం వాడవాడలా ఘనంగా జరుపుకున్నారు. వేడుకల్లో యువతీ యువకులు, చిన్నారులంతా కలిసి ఒకరిపై ఒకరు రంగులు చల్లుకున్నారు. శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు రంగుల్లో మునిగి తేలారు. పురవీధుల్లో ఆనందోత్సాహలతో గడిపారు. ఉద్యోగులు, నాయకులు ఆయా ప్రాంతాల్లో పాల్గొన్నారు. పలు పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లోనూ వేడుకలు కొనసాగాయి. ప్రజలు సాయంత్రం గోదావరి, వాగులు వంటి నీటివనరుల్లో స్నానాలు చేశారు.

– సాక్షి నెట్‌వర్క్


అశ్వారావుపేటరూరల్: పాత పేరాయిగూడెం అంగన్‌వాడీ కేంద్రంలో రంగులు చల్లుతున్న చిన్నారులు


అశ్వారావుపేట: హోలీ వేడుకల్లో మహిళలు


దుమ్ముగూడెం: హోలీ సంబురాలు చేసుకుంటున్న యువకులు


కరకగూడెం: హోలీ వేడుకల్లో ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు


ములకలపల్లి: హోలీ ఆడుతున్న చిన్నారులు


మణుగూరుటౌన్: సింగరేణి అధికారులకు రంగులు పూస్తున్న టీబీజీకేఎస్ నాయకులు


అశ్వాపురం: మొండికుంటలో హోలీ వేడుకల్లో ఉత్సాహంగా యువత


దమ్మపేట: హోలీ సంబురాలు జరుపుకుంటున్న చిన్నారులు


మణుగూరుటౌన్: రంగులు చల్లుకుంటున్న మహిళలు


భద్రాచలంఅర్బన్: కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో..


చంద్రుగొండ: తిప్పనపల్లిలో హోలీ సంబురాలు చేసుకుంటున్న యువకులు


అశ్వారావుపేటరూరల్: మామిళ్లవారిగూడెంలో సందడి చేస్తున్న యువకులు, చిన్నారులు


భద్రాచలంటౌన్: హోలీ వేడుకల్లో పాల్గొన్న పిల్లలు

మండలంలో ఎమ్మెల్యే పర్యటన


దమ్మపేట: మొద్దులగూడెం ఆలయంలో ఎమ్మెల్యే జారే, ఐడీసీ చైర్మన్ విజయ్‌బాబు

దమ్మపేట: మండల పరిధిలో సుడిగాలి పర్యట చేసిన స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, ఇరిగేషన్ డెవలప్‌మెంట్ చైర్మన్ మువ్వా విజయ్‌బాబు శుక్రవారం పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. మండలంలోని నాచారం గ్రామంలో శ్రీజగదాంబ సహిత జయలింగేశ్వర స్వామి జాతర మహోత్సవమునకు ఆలయ కమిటీ ఆహ్వానం మేరకు ఎమ్మెల్యే జారే, ఐడీసీ చైర్మన్ మువ్వా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో వీరికి ఘన స్వాగతం పలికారు. ఆలయంలో శివయ్యకు నిర్వహించిన ప్రత్యేక పూజ కార్యక్రమాల్లో పాల్గొని, స్వామివారిని దర్శించుకున్నారు. మొద్దులగూడెం శివారులో ఉన్న ఏకుల పోతమ్మ తల్లి జాతరకు హాజరై, అమ్మవారిని దర్శించుకున్నారు. దమ్మపేటలో అనారోగ్య కారణంగా ఆస్పత్రిలో చికిత్స పొందిన అనంతరం ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న కాంగ్రెస్ యువ నాయకుడు రొయ్యల కుమార్‌ను పరామర్శించి, ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అంతకుముందుగా పలు వివాహ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఆయన వెంట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ వాసం రాణి, ఏకులపోతమ్మ ఆలయ కమిటీ చైర్మన్ దొడ్డా భాస్కరరావు, మండల కాంగ్రెస్ నాయకులు తదితరులున్నారు.

పరామర్శ..

అశ్వారావుపేటరూరల్: మాజీ ఉప సర్పంచ్ కుటుంబాన్ని స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ పరామర్శించారు. స్థానిక కొనేరుబజార్‌కు చెందిన మాజీ ఉప సర్పంచ్ కేధార్‌నాథ్ తండ్రి రేమళ్ల వెంకట్రావు(92) అనారోగ్యంతో బాధ పడుతూ.. శుక్రవారం పరిస్థితి విషమించి మృతి చెందాడు. ఈ సమాచారం అందుకున్న ఎమ్మెల్యే మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. అనంతరం కుటుంబీకులను పరామర్శించి సానుభూతి వ్యక్తం చేశారు. పరామర్శించిన వారిలో కాంగ్రెస్ ప్రముఖ నాయకులు జూపల్లి రమేష్, జూపల్లి ప్రమోద్, అల్లాడి రామారావు, అప్పలరాజు ఉన్నారు.

గుండెపోటుతో హెడ్‌కానిస్టేబుల్ మృతి

ములకలపల్లి: భద్రాచలం పోలీస్‌స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ గుంపుల రాంబాబు(55) గుండెపోటుతో మృతి చెందారు. సారపాకలో నివసిస్తున్న ఆయనకు శుక్రవారం తెల్లవారుజామున ఛాతిలో నొప్పి రావడంతో భద్రాచలంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ఈలోగా రాంబాబు మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. వివిధ పార్టీల నాయకులు రాంబాబు మృతదేహం వద్ద నివాళులర్పించి ఆయన కుమారుడు రవితేజ తదితరులను పరామర్శించారు. నాయకులు పర్వతనేని అమర్‌నాథ్, పువ్వాల మంగపతి, కరుటూరి కృష్ణ, బాల అప్పారావు, గాడి తిరుపతిరెడ్డి, ఖాదర్‌బాబా, ముదిగొండ రాంబాబు, బండి కొమరయ్య, పుష్పాల చందర్‌రావు, చల్లా వెంకటేశ్వర్లుతో పాటు నాగరాజు, సత్యం, మహేశ్ పాల్గొన్నారు.

రంజాన్ కానుక

బూర్గంపాడు: మోరంపల్లిబంజర గ్రామపంచాయతీ పారిశుద్ధ్య కార్మికులకు గ్రామానికి చెందిన హానీఫ్ హోటల్ యజమాని నాగూర్ ఘని రంజాన్ కానుకలు అందించారు. శుక్రవారం పారిశుద్ధ్య కార్మికులకు రంజాన్ సందర్భంగా కానుకలు అందించారు.గ్రామాన్ని అనునిత్యం శుభ్రం చేస్తు ప్రజల ఆరోగ్యాన్ని కాపాడుతున్న పారిశుద్ధ్య కార్మికులను అందరూ గౌరవించాలని నాగూర్ ఘని అన్నారు.

డయల్ యువర్ డీఎంకు స్పందన


ప్రయాణికులతో మాట్లాడుతున్న డీఎం తిరుపతి

భద్రాచలంఅర్బన్: భద్రాచలం ఆర్టీసీ డిపో పరిధిలో శుక్రవారం నిర్వహించిన డయల్ యువర్ డీఎం కార్యక్రమానికి ప్రయాణికుల నుంచి స్పందన లభించింది. ఇందులో భాగంగా బూర్గంపాడు బస్‌స్టాండ్‌లో టైం టేబుల్, టాయిలెట్స్, డ్రింకింగ్ వాటర్ సదుపాయం కల్పించాలని ప్రయాణికులు ఆర్టీసీ జీఎంను కోరారు. భద్రాచలం నుంచి 6.00 గంటలకు బయలు దేరే కరీంనగర్ బస్సును 6.15 గంటలకు మార్చాలని పలువురు కోరారు. చర్ల రూట్ లో కుదునూరు స్టేజి వద్ద బస్సులు ఆపడం లేదని, లాస్ట్ బస్సు భద్రాచలం నుంచి రాత్రి 7.30 గంటలకు కాకుండా 8.15 లేదా 8.30 గంటలకు బయలుదేరాలని కోరారు. కలివేరు గ్రామంలో శివాలయం వద్ద బస్సులని ఆపాలని ఒకరు, అలాగే భద్రాచలం నుంచి భీమవరం బస్సు కావాలని మరొకరు కోరారు. ప్రయాణికుల సమస్యలను పరిగణలోకి తీసుకుని పరిష్కరిస్తామని డిపో మేనేజర్ తిరుపతి తెలిపారు.

కళాకారుల సంఘం ఉపాధ్యక్షుడి ఎన్నిక

అశ్వారావుపేటరూరల్: తెలంగాణ రాష్ట్ర జానపద కళాకారుల సంఘం జిల్లా ఉపాధ్యక్ష, అశ్వారావుపేట డివిజన్ అధ్యక్షుడిగా ఎండి.మూర్తుజా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఇటీవలే జిల్లా కేంద్రంలో జరిగిన ఆ సంఘం జిల్లా సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్, జిల్లా కార్యదర్శి లింగయ్య సమక్షంలో జిల్లా, డివిజన్ కమిటీ ఎన్నిక జరగ్గా అశ్వారావుపేటకు చెందిన సీనియర్ కళాకారుడు మూర్తుజాను ఎన్నుకున్నారు.

అనంతరం సంఘం బాధ్యులు, తోటి కళాకారులంతా కలిసి శాలువా కప్పి ఘనంగా సన్మానించి జ్ఞాపికలను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లా, డివిజన్ కమిటీలో తనకు అవకాశం కల్పించడం పట్ల హర్షం వ్యక్తం చేసి, కళాకారులకు అండగా ఉంటానని అన్నారు.


మూర్తుజాకు పుష్పగుచ్ఛం అందిస్తున్న సంఘం బాధ్యులు

బడ్జెట్‌లో నిధులు కేటాయించాలి


సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కార్యదర్శి మచ్చా వెంకటేశ్వర్లు

చర్ల: మార్చి19న రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టే బడ్జెట్‌లో వద్దిపేట చెక్‌డ్యామ్ నిర్మాణానికి నిధులు కేటాయించాలని, తాలిపేరు మధ్యతరహా ప్రాజెక్టు అదనపు గేట్లు నిర్మాణం, ప్రాజెక్టు ఆధునీకరణకు నిధులు కేటాయించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మచ్చా వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. శుక్రవారం చర్లలోని బీఎస్ రామయ్య భవన్‌లో సీపీఎం మండల కమిటీ సమావేశం కారం నరేష్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో మచ్చా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. గడిచిన 15 సంవత్సరాలుగా తాలిపేరు ప్రాజెక్టు అదనపు గేట్లు నిర్మాణ పనులు అసంపూర్తిగా ఉన్నాయని ఇందుకు అవసరమైన నిధులు ఈ బడ్జెట్‌లో కేటాయించాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రాజెక్టు పూడిక తీయటం, కుడి ఎడమ ప్రధాన కాలువలు చివరివకు పూడిక తీసి రైతులకు నీరు అందించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ బడ్జెట్ సమావేశాలలోనే చర్ల మండల కేంద్రంగా అగ్నిమాపక కేంద్రం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి చర్లలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని, చర్ల మండల కేంద్రాన్ని ప్రభుత్వ విద్యా సంస్థలకు నిలయంగా మార్చి ఎడ్యుకేషన్ హబ్ గా తీర్చిదిద్దాలను ఆయన కోరారు. సమావేశంలో సత్యానారాయణపురం గ్రామం నుంచి జజ్జరి నాగమణి, సావిత్రి ,సమ్మక్క చర్ల నాయకులకాలనీకి చెందిన కండెల పోశాలు పార్టీలో చేరారు. వీరికి పార్టీ జిల్లా కార్యదర్శి మచ్చా వెంకటేశ్వర్లు, జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు కొలగాని బ్రహ్మచారి, మండల కార్యదర్శి, మచ్చారామారావు పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కమిటీ సభ్యులు పాడువుగంటి సమ్మక్క, బందెల చంటి, పామారు బాలాజి, దొడ్డి హరినాగవర్మ, తాటి నాగమణి, శ్యామల చంద్రం, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పర్ణశాలలో డోలోత్సవం

దుమ్ముగూడెం: ప్రముఖ పుణ్యక్షేత్రమైన పర్ణశాల సీతారామచంద్రస్వామి వారి దేవాలయంలో పౌర్ణమి సందర్భంగా డోలోత్సవం, వసంతోత్సవ కార్యక్రమం నిర్వహించారు. అందులో భాగంగా స్వామివారికి విశ్వక్షన పూజ, పుణ్యాహవాచనం, లక్ష్మీపూజ, నిర్వహించారు. గ్రామంలోని ముత్తయిదువుల చేత పసుపు కొట్టే కార్యక్రమం, తలంబ్రాలు కలిపే కార్యక్రమం, తదుపరి మూలవర్లకు ఉత్సవమూర్తులకు వసంతోత్సవం సంప్రోక్షణ చేపట్టారు. అనంతరం స్వామి వారిని పెళ్లి కొడుకును చేశారు. సాయంత్రం స్వామివారికి తిరువారాధన, తిరువీధి సేవ, విశేష ప్రసాదం నివేదన చేశారు. కార్యక్రమంలో ఆలయ ఇన్‌చార్జ్ అనిల్‌కుమార్,ఆలయ ప్రధాన అర్చకులు శేషం కిరణ్‌కుమార్ ఆచార్యులు, ప్రతాపురం భార్గవాచార్యులు, నరసింహాచార్యులు, వెంకట ఆచార్యులు, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


ఆలయంలో పసుపు దంచే కార్యక్రమంలో పాల్గొన్న మహిళలు

వైభవోపేతంగా కల్యాణోత్సవాలు

వేంకటేశ్వర స్వామి కల్యాణం..


బూర్గంపాడు: నాగినేనిప్రోలు రెడ్డిపాలెంలో అద్భుత వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం..

బూర్గంపాడు: నాగినేనిప్రోలు రెడ్డిపాలెంలో శ్రీదేవి, భూదేవి సహిత శ్రీ అద్భుత వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం వైభవంగా జరిగింది. రెడ్డిపాలెంలోని స్వామివారి ఆలయంలో ప్రత్యేక అభిషేకాలు, హోమాలు నిర్వహించారు. అద్భుత వేంకటేశ్వర స్వామి కల్యాణాన్ని వేదపండితులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులు, గ్రామస్తులు పెద్దసంఖ్యలో స్వామివారి కల్యాణాన్ని వీక్షించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నప్రసాదాలను అందించారు.

అశ్వాపురం: మండల పరిధిలోని సండ్రలబోడు గ్రామంలోని బండ్లసిరిగుట్టపై ఉన్న శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి 19వ వార్షిక కల్యాణ మహోత్సవాన్ని శుక్రవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. కల్యాణమహోత్సవంలో మండల కేంద్రంతో పాటు, ఆమెర్ద, సండ్రలబోడు, చింతిర్యాలతో పాటు చుట్టూ ప్రక్కల గ్రామాల ప్రజలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని పూజలు చేశారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, నాయకులు, ప్రజలు, భక్తులు పాల్గొన్నారు.

చర్ల: మండలంలోని దేవానగరంలోని వెంకటేశ్వర స్వామి దేవాలయంలో శుక్రవారం అలివేలు, భూదేవి అమ్మవార్ల సహిత శ్రీ వెంకటేశ్వరస్వామి వారి కల్యాణం వైభవంగా సాగింది. పలు గ్రామాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలిరాగా, కల్యాణ మండపం భక్తులతో కిక్కిరిసింది. కళ్యాణం అనంతరం ఆలయ కమిటీ వారు భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. మండలంలోని కుదునూరులో ఉన్నవేణుగోపాలస్వామి వారి దేవాలయంలోనూ రుక్మిణి సత్యభామ సహిత వేణుగోపాల స్వామి వారి కల్యాణాన్ని నిర్వహించారు.

వేణుగోపాల స్వామి కల్యాణం..


మణుగూరురూరల్: వేణుగోపాలస్వామి వారి కల్యాణ క్రతువు నిర్వహిస్తున్న అర్చకులు

బూర్గంపాడు: ఇరవెండి గోదావరి తీరంలో సంతాన వేణుగోపాల స్వామి కల్యాణం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. చోళుల కాలంనాటి వేణుగోపాలస్వామి ఆలయ ప్రాంగణంలో స్వామివారి కల్యాణాన్ని వేదపండితులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ కల్యాణోత్సవంలో తానా మాజీ అధ్యక్షుడు తాళ్లూరి జయశేఖర్ దంపతులు పాల్గొని స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించారు. ఆలయ కమిటీ చైర్మన్ తాళ్లూరి పంచాక్షరయ్య ఆధ్వర్యంలో స్వామివారి కల్యాణ్సోవానికి వచ్చిన భక్తులకు తగు ఏర్పాట్లు చేశారు. కల్యాణం అనంతరం సంతానం లేనివారికి గరుడ ముద్దల పంపిణీ చేశారు.

మణుగూరురూరల్: మండల పరిధిలోని రామానుజవరం గ్రామంలో వేంచేసి ఉన్న రుక్మిణి, సత్యభామ సమేత శ్రీసంతాన వేణుగోపాలస్వామి కల్యాణ మహోత్సవాన్ని శుక్రవారం వైభవోపేతంగా నిర్వహించారు. వేదమంత్రాలు, పూజల నడుల కల్యాణం నిర్వహించగా.. భక్తులు పాల్గొని తిలకించారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా డీసీసీబీ డైరెక్టర్ తుళ్ళూరి బ్రహ్మయ్య, సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అయోధ్య, మాజీ సర్పంచ్ బాడిశ సతీష్, పలు రాజకీయ పార్టీల నాయకులు, ప్రముఖులు స్వామి వారిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. మున్సిపాలిటి పరిధిలోని పాత మణుగూరు(శివలింగాపురం) ప్రాంతంలోని శ్రీవేణుగోపాల స్వామి ఆలయంలోనూ కల్యాణం నిర్వహించగా.. ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు హజరయ్యారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ నానిబాబు, శ్రీనీలకంతేశ్వర స్వామి ఆలయ కమిటీ చైర్మన్ కూచిపూడిబాబు, ఆలయ కమిటి సభ్యులు, అర్చకులు, నాయకులు పీరినాకి నవీన్, శివసైదులు, దొబ్బల వెంకటప్పయ్య, గుడిపూడి కోటేశ్వరరావు, గాండ్ల సురేష్, మాజీ ఎంపీపీ ఎడారి రమేష్, పుచ్చకాయల శంకర్, గ్రామపెద్దలు, భక్తులు పాల్గొన్నారు

రాధాకృష్ణుల కల్యాణం..

అశ్వాపురం: మండల పరిధిలోని నెల్లిపాక గ్రామ పంచాయతీ టేకులగుట్ట గ్రామంలోని శ్రీ కృష్ణుడి ఆలయం ఆవరణలో శ్రీ రాధారుక్మిణి సమేత శ్రీకృష్ణ కల్యాణ మహోత్సవాన్ని శుక్రవారం కన్నుల పండుగగా నిర్వహించారు. అభిషేకాలు, గణపతి హోమం అనంతరం పూజారుల వేధమంత్రాల మధ్య కల్యాణం వైభవంగా నిర్వహించారు. పలు గ్రామాల నుండి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై తిలకించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. భక్తులకు ఇబ్బంది లేకుండా స్థానికులు, రాధాకృష్ణ సేవా సమితి నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. రాధాకృష్ణ సేవా సమితి సభ్యులు, నాయకులు, పాల్గొన్నారు.